# అప్పులపై వాస్తవాలు చెబితే కేటీఆర్, హరీశ్‌కు అక్కసు

- 8 లక్షల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని దివాళా తీయించారు
- కాళేశ్వరం పేరుతో రూ. 1.20 లక్షల కోట్లు గోదావరి పాలు
- 70 వేల ఉద్యోగాలు, 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంతో ఢిల్లీలో దోస్తీ
- బీజేపీ జాతీయ అధ్యక్షుడి సభ అట్టర్ ఫ్లాప్
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఫైర్



**కరీంనగర్, జూలై 03 (తెలంగాణ వాణి)**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై తాము వాస్తవాలు మాట్లాడుతుంటే కేటీఆర్, హరీష్ రావులకు అక్కసు వెళ్లగక్కుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక వివాహ వేడుకకు హాజరయ్యేందుకు కరీంనగర్ విచ్చేసిన ఆయనకు చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో వి-పార్క్ హోటల్ వద్ద ఘన స్వాగతం లభించింది. అనంతరం కాంగ్రెస్ నేతలతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ బీఆర్ఎస్, బీజేపీలపై నిప్పులు చెరిగారు.

### 8 లక్షల కోట్ల అప్పులు.. నెలకు రూ. 60 వేల కోట్ల వడ్డీలు

ముందస్తు ఆలోచన లేకుండా, కార్పొరేషన్ వ్యవస్థల ద్వారా ఇష్టం వచ్చినట్లు అప్పులు తెచ్చి బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని మహేష్ గౌడ్ మండిపడ్డారు. నాటి తప్పుడు నిర్ణయాల వల్ల నేడు ప్రజలపై మోయలేని భారం పడిందన్నారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి, గత ప్రభుత్వం చేసిన అప్పులకు వాయిదాల పద్ధతిలో నెలకు రూ. 60 వేల కోట్ల రూపాయల వడ్డీలు చెల్లిస్తున్నామని ఆయన వాస్తవాలను వెల్లడించారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినందుకే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ ను గద్దె దించారని, ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి సున్నా (0) సీట్లు ఇచ్చి పాతరేశారని ఎద్దేవా చేశారు.

### కాళేశ్వరం కుంభకోణం.. నేరెళ్ల బాధితులపై అరాచకాలు

కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రూ. 1.20 లక్షల కోట్ల రూపాయలను గోదావరి పాలు చేశారని పీసీసీ చీఫ్ విమర్శించారు. నాటి కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో బీఆర్ఎస్ అగ్రనేతల కనుసన్నల్లో ఇసుక మాఫియా నడిచిందని, దానిని అడ్డుకున్న నేరెళ్ల దళిత బాధితులను, యువకులను పోలీసులతో థర్డ్ డిగ్రీ ఉపయోగించి చిత్రహింసలు పెట్టిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని మండిపడ్డారు. ఆనాడు బీఆర్ఎస్ చేసిన ప్రతి నిర్వాకం నేటికీ ప్రజల మనసుల్లో సజీవంగా ఉందన్నారు.

### మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఉద్యోగాల పేరిట ప్రజలకు ఆశలు చూపి మోసం చేసిందని, కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. తమ హయాంలో ఇప్పటికే దాదాపు 70 వేల పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. ప్రతి నియోజకవర్గంలో 3 వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నట్లు తెలిపారు. గతంలో వేలల్లో కరెంట్ బిల్లులు వస్తే, నేడు పేద, మధ్యతరగతి ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ రూ. 10 వేల రుణమాఫీ కూడా సరిగ్గా చేయలేకపోతే, తాము అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసి చూపించామన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ కనీసం రూ. 25 వేల కోట్ల విదేశీ పెట్టుబడులు కూడా తీసుకురాలేకపోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు దాదాపు రూ. 6 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించి, అభివృద్ధి-సంక్షేమాలను సమానంగా ముందుకు తీసుకెళ్తోందని వివరించారు.

### ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ: బీజేపీ-బీఆర్ఎస్ ల బంధం

స్థానిక ఎంపీ బండి సంజయ్ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మహేష్ గౌడ్ అన్నారు. కేంద్రంలోని మోదీ సర్కారుకు పదేళ్లపాటు బీఆర్ఎస్ అన్ని విధాలా సహకరించిన విషయం ప్రజలు మరవలేదన్నారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలతో పాటు పార్లమెంట్ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికలు, తలాక్ బిల్లు, చివరికి రైతు వ్యతిరేక నల్ల చట్టాలకు కూడా బీఆర్ఎస్ ఎంపీలు బీజేపీకి అనుకూలంగా ఓటు వేశారని గుర్తు చేశారు. ఢిల్లీలో లోపాయికారీ ఒప్పందాలతో దోస్తీ చేస్తూ, ఇక్కడ మాత్రం పైకి శత్రువులుగా నటిస్తున్నారని దుయ్యబట్టారు.

### అట్టర్ ఫ్లాప్ అయిన బీజేపీ జాతీయ అధ్యక్షుడి సభ

బీజేపీ జాతీయ అధ్యక్షుడి సభకు పట్టుమని 2,000 మందిని కూడా పోగు చేసుకోలేకపోయారని, ఆ సభ అట్టర్ ఫ్లాప్ అయిందని మహేష్ గౌడ్ ఎద్దేవా చేశారు. బిజెపి నేతలు రాష్ట్రాన్ని వెలగబెడతామంటే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 11 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం సామాన్యుడికి చేసింది ఏమీ లేదని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించి, వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించారని ఆరోపించారు.

### ధరల పెంపుతో సామాన్యుడి నడ్డి విరిచిన మోదీ

మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు ఎక్కువగా ఉన్నా దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలను అదుపులో ఉంచామని, కానీ నేడు క్రూడాయిల్ ధరలు తక్కువగా ఉన్నప్పటికీ మోదీ ప్రభుత్వం ధరలను అమాంతం పెంచి సామాన్యుడు వాహనం నడపాలంటేనే భయపడే పరిస్థితి తెచ్చిందని విమర్శించారు. ఇంధన ధరల పెంపు వల్ల నిత్యవసరాల ధరలు పెరిగి సామాన్యులు విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం కేవలం అదానీ, అంబానీల వంటి సంపన్నులను పెంచి పోషించడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

### రేపటి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

మతాలు, కులాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా గెలవాలని చూసే బీజేపీకి తెలంగాణలో నూకలు చెల్లాయని మహేష్ గౌడ్ హెచ్చరించారు. దేవుడి పేరుతో ప్రజలను ఇకపై మోసం చేయలేరని, గత 12 ఏళ్లలో బీజేపీ వల్ల తమ జీవన ప్రమాణాలు ఏమైనా పెరిగాయా అని ప్రజలే ప్రశ్నిస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తుందని ప్రజలు గమనించారని, అందుకే ఇటీవల జరిగిన సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు కాంగ్రెస్ వైపే నిలిచారని గుర్తు చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిచి, మళ్లీ ఘనంగా అధికారంలోకి వస్తుందని మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్నూరు కాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఊట్కూరు నరేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు ఆరేపల్లి మోహన్, హుజురాబాద్ నియోజకవర్గం ఒడితల ప్రణవ్, రాజన్న సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్లు ఆకుల నరసయ్య, మహేష్, నాయకులు ఉప్పుల అంజని ప్రసాద్, అన్నమనేని నర్సింగరావు, వెలిచాల తిరుమలరావు, మల్లికార్జున రాజేందర్, ఎం డి తాజ్, కొర్వి అరుణ్ కుమార్,ముత్యం శంకర్ గౌడ్, గుమ్మడి రాజ్ కుమార్,వరాల నర్సింగం, ఆకుల ఉదయ్, కాంతాల జగన్ రెడ్డి, పడాల అజయ్ గౌడ్, మునిగంటి అనిల్,భాస్కర్ నాయక్, పర్వత మల్లేశం, సిరాజు హుస్సేన్, పత్తి కృష్ణారెడ్డి, వాసిరెడ్డి దుర్గారెడ్డి, వంగల విద్యాసాగర్, పడిశెట్టి భూమయ్య, రామిడి రాజిరెడ్డి, పంజాల స్వామి గౌడ్, చర్ల పద్మ, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, ముద్ద సాని క్రాంతి, రాచర్ల పద్మ, కుంభాల రాజు కుమార్, మీస రమాదేవి, ఇమ్రాన్, మంద మహేష్, హస్త పురం రమేష్, ఎండి చాంద్, పోరండ్ల రమేష్, ఫహాద్,ఎర్ర శ్రీనివాస్, బొబ్బిలి విక్టర్,సరోజ,వీర దేవేందర్, కపిల్ మాధవ్, సుదర్శన్,ఇమ్రాన్ గని, సత్తినేని శ్రీకాంత్, గడ్డం శ్రీనివాస్, ఉప్పురి విశాల్, గంగుల దిలీప్, గున్నాల రమేష్, మాలోతు మహాలక్ష్మి, బాబుల్ వర్మ, అజయ్ గౌడ్, శుకూర్, ఆరిఫ్, తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, హసీనా, శిల్ప, పెంట శేఖర్, కర్రె పావని, రంగా నాయక్, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.